క్లుప్తంగా

‘కల్యాణలక్ష్మి’ చెక్కులు అందజేయాలి

దామరగిద్ద: మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వెంటనే అందజేయాలని బీజేవైఎం నాయకుడు సింగారం అంజనేయులు డిమాండ్ చేశారు. చెక్కులు జారీ చేసి నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు అందడం లేదన్నారు. అధికారులను అడిగితే పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారని పేర్కొన్నారు. జాప్యం తగదని వెంటనే అందించి లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించాలన్నారు.

నట్టలనివారణమందులు పంపిణీ



నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం గ్రామంలో శుక్రవారం నట్టల నివారణ మందుల పంపిణీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నట్టల నివారణ మందులు వేయడం వల్ల పశువుల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుందని, ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రేవతి, ప్రతాప్, గోపాలమిత్ర మాశప్ప, గొర్రెల పెంపకందారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాగనూర్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడంతో ఎన్నో లాభాలు ఉన్నాయని మండల జూనియర్ పశువైద్యాధికారి వినయకుమార్ తెలిపారు. శుక్రవారం మాగనూర్ గ్రామంలో మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధుల నుంచి రక్షణకు ప్రభుత్వం అందిస్తున్న మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, ఎంపీపీ శ్యామలమ్మ, పశువైద్య సిబ్బంది యశోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మాగనూర్(మక్తల్): లింగంపల్లి గ్రామానికి చెందిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడైన తాహేర్ పాషా చిన్న వయసులో అకాల మరణం పొందడంతో బాధిత కుటుంబానికి రూ. పదివేలు ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్, టగ్గాఫ్‌వార్ అసోసియేషన్ అధ్యక్షుడైన తాన్‌సింగ్ రాజ్‌పురోహిత్, జిల్లా ప్రధానకార్యదర్శి గోపాలం శుక్రవారం గ్రామానికి వెళ్లి నగదు అందజేశారు. ముందుందు వారికి అన్ని విధాలుగా సహకారం అందజేస్తామన్నారు. సర్పంచ్ సుజాత, శివలింగప్ప, ఎంపీటీసీ లతా, అంజనేయులు, రామలింగప్ప, భీమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌పై వ్యాపారులకు అవగాహన

అమరచింత: ఆత్మనిర్భర్ పథకంలో భాగంగా బ్యాంకు రుణాలను పొందిన చిరు వ్యాపారులకు క్యూఆర్‌కోడ్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలను పొందిన చిరు వ్యాపారులందరికీ బ్యాంకు లావాదేవీలు ఆన్‌లైన్‌లో చేసేలా క్యూఆర్ కోడ్‌ను అమలు పర్చి అందిస్తున్నట్లు తెలిపారు. మెప్మా ఏపీఎం యువరాజ్, ఆర్‌పిలు గోపాల్, రాజేశ్వరి పాల్గొన్నారు.

మార్చి10 నుంచి ఉర్సు

అమరచింత: పట్టణ కేంద్రంలో వెలసిన సయ్యద్ షా రాజావళి దర్గా షరీఫ్ ఉర్సును మార్చి 10 నుండి 12 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటి సభ్యులు మైను, రఫీక్, ఫరీద్ తెలిపారు. శుక్రవారం నమాజు అనంతరం దర్గా ఆవరణంలో ఉర్సు సంబంధించిన ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఎంతో చరిత్ర కలిగి, భక్తుల కోరిన కోర్కెలు తీర్చే భగవంతుడిగా పూజలందుకుంటున్న రాజావళి దర్గాకు ఏటా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారని వెల్లడించారు. 10న గంధోత్సవం, 11న తాజే చిరాక్, 12న ఖత్మేఖురాన్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. మూడు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఖవ్వాలి ఉంటుందన్నారు.

సైన్స్‌తోనే సమాజ అభివృద్ధి

దేవరకద్ర రూరల్: శాస్త్ర సాంకేతిక రంగాలతోనే సమాజాభివృద్ధి సాధ్యమని కౌకుంట్ల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్‌హాఖ్ అన్నారు. పిల్లలమర్రి సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం కౌకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ సంబురాలను నిర్వహించారు. మూఢ నమ్మకాల నిర్మూలన, సైన్స్ అభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముచ్చింతల, పేరూర్, అప్పంపల్లి గ్రామాలకు చెందిన ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల ‘భాండాగారం’

- గ్రంథాలయంలో అందుబాటులో లేని పుస్తకాలు
- శిథిలావస్థలో భవనం
- ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు



ధన్వాడ గ్రంథాలయం



కూలడానికి సిద్ధంగా ఉన్న పుస్తకాల గది

ధన్వాడ: ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో పుస్తక భాండాగారాలు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, ఇతర పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ధన్వాడ మండల కేంద్రంలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక్కడ 35 సంవత్సరాల క్రితం ప్రభుత్వం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. 20 ఏళ్ల కిందట ప్రత్యేక భవనం నిర్మించి అందులోకి మార్చారు. కాగా నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో కొద్దిరోజులకే శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. అంతేకాకుండా ఇక్కడ విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. పుస్తకాలు అందుబాటులో లేవు. ఉన్న పుస్తకాలు కూడా చెదలు పడుతున్నాయి. ఇప్పటివరకు 350 మంది చందాదారులుండగా, సుమారు 150 మంది పాఠకులు రోజు గ్రంథాలయానికి వెళ్లేవారు. కానీ ప్రస్తుత సమస్యల నేపథ్యంలో అక్కడికి వెళ్లేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. అదేవిధంగా ధన్వాడలో విధులు నిర్వహిస్తున్న గ్రంథపాలకుడిని నర్వ మండలం ఇన్‌చార్జ్‌గా కేటాయించారు. దీంతో అక్కడా ఇక్కడా విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రస్తుతం ధన్వాడలో అటెండర్‌తో గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు ఇక్కడ విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. చుట్టూ ప్రహరీ, పాఠకులకు మరుగు దొడ్ల సౌకర్యాలు కూడా లేవు, గ్రంథాలయ స్థలాన్ని కూడా కొందరు కబ్జా చేసుకుంటున్నారు. బాధ్యులు గ్రంథాలయం పరిస్థితిని చూసి నూతన భవనం కట్టిస్తామని చెప్పినా అది మాటల వరకే పరిమితం అవుతోంది. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ శాఖాధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని, పూర్వవైభవం తీసుకొస్తారని పాఠకులు కోరుతున్నారు.

పుస్తకాలు చెదలు పడుతున్నాయి



గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పుస్తకాలు అందుబాటులో లేవు. ఉన్న కొన్ని కూడా చెదలు పడుతున్నాయి. ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. అంతేకాకుండా పాఠకులు కూర్చోవడానికి సరైన కుర్చీలు కూడా లేవు. అధికారులు స్పందించి ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించి వినియోగంలోకి తీసుకురావాలి.

– శ్రీనివాస్, ధన్వాడ

నూతన భవనం నిర్మించండి

నేను 30 సంవత్సరాలుగా గ్రంథాలయానికి వెళ్లేవాడిని. కానీ ప్రస్తుతం మానేసాను. ఇక్కడ అనేక సమస్యలు విలయతాండవం చేస్తుండడంతో పాఠకులు రావడానికి ఆసక్తి చూపడం లేదు. భవనం శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు కూలుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలి. నూతన భవనం నిర్మించాలి.

– సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు, ధన్వాడ

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనుల ప్రారంభంలో పాల్గొన్న నాయకులు

మాగనూర్: గ్రామాల్లో అంతర్గత రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వం కనికరం చూపించిందని వర్కూర్ గ్రామ సర్పంచ్ నిర్మలమ్మ అన్నారు. గ్రామంలోని ఒకటవ వార్డు నుంచి 3వ వార్డు వరకు ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన రూ. 10 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిప్పయ్య, రామకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ శివరాజ్‌రెడ్డి, నర్సిములు, రాము, శ్రీనివాసులు, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఇసుక రవాణా నిలిపివేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతులతో తరలిస్తున్న ఇసుక రవాణాను నిలివేయాలని గ్రామస్తులు, రైతులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇసుక తరలింపుతో వాగు పరిసరాల పొలాలకు నీటి సమస్య ఏర్పడుతోందని అన్నారు. ముఖ్యంగా రవాణా కోసం గ్రామంలో తిరుగుతున్న టిప్పర్ల వల్ల నిత్యం ప్రమాదాలు సంభావిస్తున్నాయని ఇప్పటికే అనేక పశువులు, కోళ్లు మృత్యువాత పడ్డాయని, పలువురు గాయపడ్డారన్నారు. గ్రామం మధ్యలో వాహనాలు తిరుగుతుండటంతో ఇంట్లో నుంచి బయటకు రావడానికి గ్రామస్తులు భయపడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి అనుమతులు రద్దు చేసి మరో చోటుకు మార్చాలని కోరారు. నిలుపుదలపై గ్రామస్తులందరం కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు తిప్పయ్య, మారెప్ప, శంకరప్ప, కృష్ణయ్య, వెంకటేష్, కేశవరెడ్డి, వెంకటప్ప, అంజనేయులు, తాయప్ప పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘కంటివెలుగు’



కొత్తపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మాగనూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. కొత్తపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శిబిరం ఏర్పాటు చేయగా, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో కొనసాగుతున్నాయని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరాల వద్ద కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘సమస్యల సాధనకు కృషి’



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మరికల్: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల సాధనకు తమ కృషిచేస్తున్నట్లు తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మరికల్‌లోని పెద్దచింతకుంట ప్రాథమికోన్నత పాఠశాల్లో శుక్రవారం ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో తపస్ నాయకులు సురేష్, జ్ఞానేశ్వర్, కవిత, రాఘవేంద్ర, సంజీవ్, ఆనంద్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు



కొల్లూరులో స్వయంపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా చైతన్య, డీఈఓగా హారిక, ప్రధానోపాధ్యాయులుగా రాజేశ్వరి, ఎంఈవోగా సింధూజ, ప్రధానోపాధ్యాయులుగా లావణ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా చాలా చక్కగా పాఠాలు బోధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశామన్నారు. సర్పంచ్ నిర్మలమ్మ, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఉపసర్పంచ్ పార్ల కృష్ణయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ లక్ష్మమ్మ, ఉపాధ్యాయులు నాగేష్, జ్యోతి, రోజ, శిరిష తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని కొల్లూరు, నిడుగుర్తి పాఠశాలలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్‌లు యశోదమ్మ, సరోజాసంవృద్ధి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, కృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ చిన్న బీరప్ప, ఉపాధ్యాయులు తస్లీం, సుజాత, శరణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని పస్పుల ప్రాథమిక పాఠశాల్లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి వారి ఆకట్టుకునేలా బోధించారు. చక్కగా రాణించిన విద్యార్థులను హెచ్‌ఎం నవీన్, ఉపాధ్యాయులు అభినందించారు.



వర్కూర్‌లో..



పస్పులలో..

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మాగనూర్: మండలంలోని మందిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మలుపు సమీపంలో వ్యవసాయ బావులు కూడా ఉన్నాయని, అదుపుతప్పి అందులో పడే ప్రమాదముందన్నారు. గతంలో ఈ విషయంపై అనేక మంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. ఈ మార్గంలో ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో మాత్రమే అధికారులు ఆ పూటకు హడావిడి చేసి చేతులు దులుపేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలందరూ తిరుగుబాటు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని సీపీఎం నాయకులు వెంకటేష్, రమేష్ అన్నారు. పట్టణంలో శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో శ్రీను, వెంకటేష్, రమేష్, సూరి, పాల్గొన్నారు.

రోడ్లు నాణ్యతతో వేయండి

అమరచింత: పట్టణంలో సీసీ రోడ్లు నాణ్యతతో వేయాలని 2వ వార్డు కౌన్సిలర్ మంగ లావణ్య శుక్రవారం తెలిపారు. టీయూఎఫ్‌డీసీ నిదులను దుర్వినియోగం చేస్తు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. రోడ్డు నిర్మాణ వ్యవహారంలో 4 మీటర్ల వేయాల్సిన రోడ్లను కేవలం 2 నుంచి 3 మీటర్ల మేరకు వేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, ఏఈలకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. నాణ్యత లేని సీసీ రోడ్లతో క్యూరింగ్‌లేక పగుళ్లు ఏర్పడుతున్నాయని అన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ఊట్కూరు చెక్‌పోస్టు వద్ద ప్రధాన కూడలి

ఊట్కూరు: మండలంలోని చెక్‌పోస్టు దగ్గర అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని వివిధ గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం మక్తల్, నారాయణపేట మీదుగా తిరిగే వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలు నివారించడం కోసం చర్యలు తీసుకోవాలంటున్నారు. చెక్‌పోస్టు దగ్గర మూడురోడ్లు కలిసే కూడలిలో స్పీడ్ బ్రేకర్ లేకపోవడం వల్ల గ్రామంలోకి వెళ్లే రోడ్డులో వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలంటున్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవం



వేడుకలో పాల్గొన్న సర్పంచ్ దంపతులు

మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ శివాలయంలో శుక్రవారం ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. సర్పంచ్ పద్మమ్మ, చింతలయ్య దంపతులు వేడుకలను నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వహకులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో నర్వ విండో అధ్యక్షులు లక్ష్మీకాంత్‌రెడ్డి, మల్లేష్, సుదర్శన్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రాయప్పలు పాల్గొన్నారు.

బస్సు నడపాలని ధర్నా



నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు

మాగనూర్(నర్వ): నర్వ మండల కేంద్రానికి ఆత్మకూర్ నుంచి బస్సు నడపాలని డిమాండ్ చేస్తు యాంకి గ్రామంలోని రహదారిపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ వనపర్తి జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ, నారాయణపేట జిల్లా ఉపాధ్యాక్షుడు మహేందర్‌లు మాట్లాడుతూ.. ఆత్మకూర్ నుంచి నర్వ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు , ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ విషయంపై గతంలోను డిపో మేనేజర్‌కు తెలిపినప్పటికీ నేటికీ స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమేష్, రాఘవేంద్ర, జ్యోతి, మల్లేశ్వరి, అరుణ్, ఉమా, కావేరి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

మాగనూర్(కృష్ణ): ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం అవసరం అని కృష్ణా మండల ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్వచ్ఛ భారత్‌పై ఖాన్‌దొడ్డి గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సమంజసం కాదు

అమరచింత: పట్టణంలో ఎమ్మెల్యే నిధులతో నిర్మిస్తున్న దుకాణ సముదాయాలను బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అయ్యుబ్, ప్రధాన కార్యదర్శి తౌఫిక్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వి లేకరుల సమావేశంలో మాట్లాడారు. 2018లో ఎమ్మెల్యే ఇచ్చిన నిధులతో పనులను మసీద్ కమిటీ ద్వారా చేపట్టినట్లు తెలిపారు. దీంతో బీఆర్‌ఎస్ చెందిన నాయకులు తమ వ్యాపారాలు దెబ్బతింటాయన్న అక్కసుతోనే వీటిని వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని ఖబరస్తాన్ ప్రధాన రహదారికి దగ్గరగా ఉండటంతో, వీటిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే మసీద్‌కు ఆదాయంతో పాటు వ్యాపార అభివృద్ధి అవుతుందని బీఆర్‌ఎస్ నాయకులే నిధులు ఇప్పించి ఇప్పుడు అడ్డుకుంటున్నారన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ సహరించాలని కోరారు. జుబేర్‌ఆహ్మద్, ఖాసీం, అక్బర్, సద్దాం, ఇస్మాయిల్, ఆబిద్, మహిమూద్ పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

దేవరకద్ర రూరల్: మండలంలోని కౌకుంట్లకు చెందిన కతలయ్య, పద్మమ్మ దంపతుల కూతురు వివాహనికి సామాజిక వేత్త పవన్‌కుమార్ యాదవ్ రూ.50వేల ఆర్థికసాయం అందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన వివాహనికి పవన్ యాదవ్ యువసేన సభ్యులు హాజరై మంటపంలో వధువు తల్లితండ్రులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు. మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేష్, అంజనేయులు, కురుమూర్తి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

అమరచింత: గ్రామలతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఊర కుక్కల బెడద ఎక్కువగా ఉందని వీటి నుంచి చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అవగాహన కల్పించారు. పాఠశాలకు వెళ్తున్న, ఇంటికి వస్తున్న సమయాల్లో ఊర కుక్కలు ఎక్కువగా ఉంటే సమాచారాన్ని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. త్వరలోనే ఊర కుక్కలు పట్టణంలో సంచరించకుండా మున్సిపల్ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇష్టారీతిన వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారులతో మాట్లాడుతున్న పోలీసులు

నారాయణపేట రూరల్ : మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని కానిస్టేబుల్ శంకరయ్య అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కారాదని, తమ కెరియర్‌పై దృష్టి పెట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం, ధూమపానం వంటి వాటిని విడనాడాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, ఇష్టారీతిగా పార్కింగ్ చేయరాదని, ఇతర వాహనాలకు ఆటంకం కల్గిస్తే ఫైన్ కట్టాల్సి వస్తుందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమని, నిర్ణీత వేగంతోనే వాహనాలను నడపాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో శివకుమార్, జయప్రకాష్, సంతోస్, సుధాకర్ పాల్గొన్నారు.